సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం ; 17 ; మార్చి ; 2023



ఆదివాసీ భాషల్లో బోధన IIలో
గిరిజన ప్రాంతాలలో ఉపాధ్యాయులంతా ఆదివాసీ భాషల్లో విద్యాబోధనకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సలీమ్‌బాషా కోరారు.



పోరాటయోధుడు అమరజీవి
తెలుగు రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చరిత్రలో నిలిచారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. IIలో



దొంగనోట్ల ముఠా గుట్టురట్టు
దొంగనోట్ల చలామణి ముఠాను చింతూరు సబ్ డివిజన్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆదిలోనే అడ్డుకట్ట వేశారు. IIలో

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
సాక్షి,పాడేరు: జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఖాళీగా ఉన్న 64 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.అంగన్‌వాడీ కార్యకర్తలు 9, ఆయాలు 48, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు 17 పోస్టులు ఖాళీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద వీటి వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈనెల 17నుంచి 24వతేదీ సాయంత్రం ఐదుగంటల వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు నేరుగా లేదా పోస్టల్ ద్వారా గాని దరఖాస్తులు పంపవచ్చన్నారు. ఆయా సీడీపీవో కార్యాలయాల వద్ద పోస్టుల వివరాలతో పాటు దరఖాస్తు చేసే విధానం,అర్హత, నియమ నిబంధనల వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు కొనుగోలు
- ఉప ముఖ్యమంత్రికి ఎమ్మెల్యేల వినతి



ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, కళావతి, జోగారావు

సాక్షి,పాడేరు: గిరిజనులు సాగుచేసే నాణ్యమైన పసుపును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి, మద్దతుధర కల్పించాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు ఎమ్మెల్యేలు విన్నవించారు. పాడేరు, అరకులోయ, పాలకొండ, పార్వతీపురం ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, విశ్వసరాయి కళావతి, అలజంగి జోగారావు గురువారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆయనను కలిశారు. పసుపునకు గిట్టుబాటు ధర లేక గిరిజన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. మార్క్‌ఫెడ్ సంస్థతో పసుపు కొనుగోలు చేయించి పసుపు రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

21 నుంచి ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు
కూనవరం: మండలంలో ఈనెల 21 నుంచి 31 వరకు పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు నిర్వాసితుల కుటుంబాలకు సంబంధించి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.అనసూయ గురువారం తెలిపారు. 21 మధ్యాహ్నం 2.30 గంటలకు పంద్రాజుపల్లి, 23 మధ్యాహ్నం 2.30 గంటలకు కొండ్రాజుపేట, 24 ఉదయం 10.30 గంటలకు టేకుబాక, 25న ఉదయం 10.30 గంటలకు శబరి కొత్తగూడెం, 27 ఉదయం 10.30 గంటలకు పెదార్కూరు, 28 ఉదయం 10.30 గంటలకు టేకులబోరు, 31 ఉదయం 10.30 గంటలకు కూనవరం గ్రామాల్లో (కూనవరంలో రెండురోజులు) ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు జరుగుతాయన్నారు.

విశాఖ.. వికాసం



స్మార్ట్ సిటీ కింద రూ.50కోట్ల కేటాయింపు

పాడేరు, నర్సీపట్నం మెడికల్ కళాశాలలకు నిధులు

ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.141.79 కోట్లు

నక్కపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రూ.302.04 కోట్లు



- కాబోయే పరిపాలన రాజధానిగా ఉద్ఘాటన
- ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు
- రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి విశాఖకు అధిక ప్రాధాన్యం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర బడ్జెట్‌లో విశాఖ వికసించింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు అధిక ప్రాధాన్యం లభించింది. కాబోయే పరిపాలన రాజధానిపై ప్రత్యేక ఫోకస్ కనిపించింది. స్మార్ట్ సిటీ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధుల కేటాయింపు, నక్కపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి వంటివి రాష్ట్ర ప్రభుత్వం విశాఖపై చూపుతున్న శ్రద్ధకు దర్పణం పడుతోంది. ఇంకా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనాలు విస్తృతం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వివిధ వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ కానున్న విశాఖకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు బడ్జెట్‌లో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రకటించారు. ఈ నిధులతో నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వనున్నారు. రోడ్లు, డ్రెయిన్లు, పచ్చదనం, సుందరీకరణ, పార్కులు వంటివి మెరుగు పరచడం పాటు మరెన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఫలితంగా విశాఖలో పరిపాలన రాజధానికి అవసరమైన అభివృద్ధికి బాటలు పడనున్నాయి. దీంతో నగరం మరింత శోభాయమానంగా మారడానికి ఆస్కారమేర్పడనుంది. మరోవైపు స్మార్ట్ సిటీ నిధుల కింద విశాఖకు రూ.50 కోట్లు కేటాయించారు. ఇది కూడా విశాఖ నగర అభివృద్ధికి, బ్యూటిఫికేషన్‌కు ఎంతగానో దోహదపడనుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఈ బడ్జెట్‌లో 302.04 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఈ యూనివర్సిటీలో పలు అభివృద్ధి పనులు జరగనున్నాయి.

ఇంకా మరెన్నో..

విశాఖలో గిరిజన పరిశోధన సంస్థ ఏర్పాటు, నిర్మాణానికి రూ.4.43 కోట్లు, విశాఖలో ఆక్టోపస్‌కు రూ.6.89 కోట్లు, పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ స్టేషన్ల ఆధునికీకరణకు రూ.33.58 కోట్లు, గ్రేహౌండ్స్ బలోపేతానికి, ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి రూ.25.87 కోట్లు, విశాఖ సాంకేతిక విద్య, ఉపాధి, శిక్షణ విభాగానికి రూ.44 కోట్లు చొప్పున కేటాయించారు. గిరిజన ప్రాంతంలో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు రూ.120 కోట్లు, మైదాన ప్రాంతంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుకు రూ.220 కోట్లు అలాట్ చేశారు. దీంతో పాడేరు, నర్సీపట్నంలో నిర్మించ తలపెట్టిన వైద్య కళాశాలలకు భారీగా నిధులు విడుదల కానున్నాయి. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ కోసం రూ.50కోట్లు కేటాయించగా.. విశాఖలోని మత్స్యకారులకు దాదాపు రూ.4 కోట్ల ప్రయోజనం చేకూరనుంది.

సుజల స్రవంతికి రూ.141.79 కోట్లు
ఎంతో ప్రాధాన్యం కలిగిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి ఈ బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించి ఈ పథకంపై ప్రభుత్వానికున్న శ్రద్ధను చాటుకున్నారు. ఈ నిధులు ఈ పథకం శరవేగంగా పూర్తి కావడానికి దోహదపడుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. విశాఖపట్నం-చెన్నై కారిడార్ పరిధిలోని నక్కపల్లి ఇండస్ట్రియల్ క్లస్టర్ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీంతో ఆ ప్రాంతం గణనీయంగా అభివృద్ధి చెందే వీలుంటుంది. మరోపక్క ఈ బడ్జెట్‌లో పర్యాటక, సాంస్కృతిక కోసం రూ.1,291 కోట్లు కేటాయించారు. పర్యాటకపరంగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న విశాఖలో ఆ రంగానికి మరింత ఆదరణ పెరిగే అభివృద్ధి పనులకు ఆస్కారం కలుగుతుంది. మరోవైపు విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి రూ.236.85 కోట్లు, ఈ కారిడార్ భూసేకరణ, పరిశ్రమల అవసరాలకు రూ.200.25 కోట్లు కేటాయించారు.

సంక్షేమ బడ్జెట్



సంక్షేమం, అభివృద్ధి సమన్వయం చేస్తూ రూపకల్పన చేసిన బడ్జెట్ ఇది. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. సమాజంలో పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం, సమానత్వం సాధనకు బడ్జెట్ ఉపయుక్తంగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా సమాజంలో అట్టడుగు వర్గాలను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా, అభివృద్ధిని జోడించిన నిర్ణయాలు కనిపిస్తున్నాయి.

– ఆచార్య పి.విశ్వనాథం, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం

విద్యకు అధిక ప్రాధాన్యం



ప్రాథమిక, సాంకేతిక, ఉన్నత విద్య రంగాలకు రూ.32 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం. సంక్షేమ పథకాలు, పరిశ్రమలకు సమ ప్రాధాన్యమిచ్చేలా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నవరత్నాల్లో పేర్కొన్న సంక్షేమ పథకాలను శతశాతం అమలు చేసే విధంగా కేటాయింపులు పెరుగుతున్నాయి. విద్యకు కేటాయింపులు పెంచడం ఫలితంగా విలువైన మానవ వనరులను తీర్చిదిద్దడం లక్ష్యంగా కనిపిస్తోంది.

– ఆచార్య ఎస్.పుల్లారావు, అర్థశాస్త్ర విభాగాధిపతి

నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం



రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి రూ.1166 కోట్లు కేటాయించడం మంచి పరిణామం. 192 నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయం అభినందనీయం. తద్వారా యువతలో సంపూర్ణ నైపుణ్యాలను వృద్ధి చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరచడం సాధ్యపడుతుంది. ఐటీఐల్లో నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన నిర్ణయం అభినందనీయం.

– డాక్టర్ జి.వీర్రాజు, విభాగాధిపతి, ప్రభుత్వ పాలన రాజనీతిశాస్త్ర విభాగం

ఇంటర్ ద్వితీయం.. ప్రశాంతం



పాడేరు జూనియర్ కళాశాల సెంటర్‌లో పరీక్ష రాస్తున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు



పాడేరులో ఇంటర్ విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న ఇన్విజిలేటర్

- పరీక్షలు ప్రారంభం
- పాడేరులో విద్యార్థి డిబార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా 26 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయ. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 9 గంటల లోపే చేరుకున్నారు. దూర ప్రాంతాల్లోని కళాశాలల విద్యార్థులు ఆర్టీసీ కల్పించిన బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. పాడేరు ఐటీడీఏలో కమాండ్ కంట్రోల్ పాయింట్ నుంచి డివిజన్‌లోని 16 పరీక్ష కేంద్రాలను అధికారులు పర్యవేక్షించారు. పాడేరులోని జూనియర్ కళాశాల ఏ సెంటర్‌లో 352 మంది వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులు హాల్‌టికెట్లు పొందగా 336 మంది పరీక్షలు రాశారు. 16 మంది గైర్హాజరయ్యారు. అలాగే వివిధ గ్రూప్‌లకు సంబంధించి 139 మంది విద్యార్థులకు గాను 136 మంది పరీక్ష రాశారు. ముగ్గురు గైర్హజరయ్యారు. బి సెంటర్‌లో 134 మందికి 132 మంది పరీక్షకు హాజరయ్యారు. కుమ్మరిపుట్టు ఏపీ ఆర్ సెంటర్‌లో 282 మంది విద్యార్థులకు గాను 271మంది పరీక్ష రాశారు. 11మంది గైర్హజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పటిష్టంగా ఏర్పాటుచేశారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్‌కు విద్యార్థిని డిబార్ చేశారు.

సిమెంట్ దిమ్మల ఏర్పాటు



మలుపు వద్ద ఏర్పాటు చేస్తున్న సిమెంటు దిమ్మలు

సాక్షి ఎఫెక్ట్..

అనంతగిరి: మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డులో రక్షణ చర్యలను అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో 'రక్షణ గోడ శిథిలం పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన గత నెల 24న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎన్‌హెచ్5 అధికారులు స్పందించారు. హెయిర్ పిన్‌బెండ్ నాలుగో నంబరు మలుపు వద్ద శిథిలావస్థకు చేరిన రక్షణ గోడ ప్రదేశంలో సిమెంట్ దిమ్మలు ఏర్పాటుచేశారు. ప్రమాదకరమైన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు ఎన్‌హెచ్5 అధికారులు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- గిరిజన సహకార సంస్థకు కాఫీ విక్రయించాలి
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచన



కాఫీ రైతులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: దళారులను నమ్మి మోసపోకుండా కాఫీని జీసీసీకే విక్రయించాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచించారు. మండలంలోని మారుమూల పైనంపాడు పంచాయతీలో గురువారం ఎంపీపీ శెట్టి నీలవేణితో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక గిరిజనుల ఫిర్యాదు మేరకు కించుమండ రోడ్డు నుంచి పైనంపాడు వరకు 2016లో పీఎంజీవై పథకంలో వేసిన రోడ్డు పనులను, నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఎగువసొనభ నుంచి కాకరపాడు వరకు మిషన్‌కనెక్ట్ పాడేరులో రూ.కోటి మంజూరైనందున వెంటనే పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం పైనంపాడులో కాఫీ రైతులతో మాట్లాడారు. జీసీసీకి విక్రయించాలని సూచించారు. మండల కేంద్రంలో పీహెచ్‌సీకి ప్రహరీ, బాలికల-2 ప్రహరీ, పలు మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఐటీడీఏ పీవోకు ఎంపీపీ శెట్టి నీలవేణి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తమ్మన్న, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, మాజీ వైస్ ఎంపీపీ గుండన్న, మాజీ ఎంపీటీసీ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ

- కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్
- 7 రౌండ్లుగా లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు
- ఒక్కో రౌండ్‌లో 28 వేల ఓట్ల లెక్కింపు
- శుక్రవారం మధ్యాహ్నానికి ఫలితం?



స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ సందడి

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. గురువారం అర్ధరాత్రికి రెండు రౌండ్లు పూర్తికాగా.. ఇంకా ఐదు రౌండ్ల లెక్కింపు కొనసాగుతోంది. శుక్రవారం మధ్యాహం ఫలితం వెలువడే అవకాశం ఉంది. గురువారం ఉదయం 7 గంటలకు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా. మల్లికార్జున సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులు బయటకు తీసుకొచ్చారు. అనంతరం ర్యాండమైజేషన్ ద్వారా బాక్సులను ఓపెన్ చేసి అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు సమక్షంలో కట్టలు కట్టే ప్రక్రియ ప్రారంభించారు. మొత్తం 12 రౌండ్లలో బ్యాలెట్ పేపర్లు కట్టలు కట్టారు. బ్యాలెట్ పేపర్లు కట్టలు కట్టేందుకు దాదాపు 10 గంటల సమయం పట్టింది. అనంతరం.. ఒక్కో రౌండ్‌కు 28 వేల ఓట్లు చొప్పున 2,00,926 ఓట్లను ఏడు రౌండ్లుగా విభజించారు. ఒక్కో టేబుల్‌పై 1000 చొప్పున 28 టేబుల్స్‌పై మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో మొదటి రౌండ్ ప్రక్రియ సాయంత్రం 6.30 గంటల సమయంలో ప్రారంభమైంది. తొలి రెండు రౌండ్లలో టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు మెజార్టీ లభించింది.

పోస్టల్ బ్యాలెట్‌లో చెల్లని ఓట్లు 228..

వివిధ ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునే వెసులుబాటు కల్పించారు. మొత్తం 767 పోస్టల్ బ్యాలెట్స్ కేటాయించగా కేవలం 583 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 228 ఓట్లు చెల్లని ఓట్లుగా పరిగణించారు. ప్రాధాన్యత అంకెలు వేయడంలో కొందరు ఉద్యోగులు తప్పులు చేస్తే.. ఓటుతో పాటు సర్వీస్ సర్టిఫికెట్ నకలు జత చేయడాన్ని మరికొందరు విస్మరించారు. మిగిలిన 355 ఓట్లను బ్యాలెట్ బాక్సుల నుంచి కట్టలు కడుతున్న వాటిలో కలిపేశారు. పోస్టల్ బ్యాలెట్స్ ఓట్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున స్వయంగా పరిశీలించారు.

కట్టుదిట్టంగా భద్రత

కౌంటింగ్ జరుగుతున్న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను అమలు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షించారు.



కౌంటింగ్ కేంద్రంలోకి బ్యాలెట్ బాక్సులు తీసుకొస్తూ...



బ్యాలెట్ పేపర్లు లెక్కింపులో నిమగ్నమైన సిబ్బంది



స్వర్ణభారతి ఇండోర్ ఆడిటోరియం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ శ్రీకాంత్

మన్యంలో విస్తారంగా వర్షాలు



పాడేరులో గురువారం రాత్రి కురుస్తున్న వర్షం



అరకులోయలో భారీ వర్షానికి చేరిన నీరు



గుమ్మా ఘాట్ వద్ద వడగళ్లు

సాక్షి,పాడేరు: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా రెండు రోజుల నుంచి మన్యంలో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి ఆకాశమంతా మేఘావృతం కావడంతో వాతావరణం చల్లబడింది.మధ్యాహ్నం నుంచి మన్యంలో వర్షం మొదలైంది.అరకులోయ పట్టణంతో పాటు,సమీప గ్రామాల్లో మధ్యాహ్నం సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.అరకులోయ–అనంతగిరి ఘాట్‌లో కూడా వర్షం కురిసింది. పాడేరులో సాయంత్రం నాలుగు గంటల నుంచి జల్లులు కురవగా,ఆరుగంటల తరువాత భారీ వర్షం కురిసింది.

హుకుంపేట: మండలంలోని గురువారం గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయం అయ్యాయి. పసుపు, అల్లం తవ్వకాలకు అనుకూలమని రైతులు తెలిపారు.

అనంతగిరిలో రెండు గంటలు..

అనంతగిరి: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఐదు గంటల నుంచి రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయం అయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జనజీవనం స్తంభించింది.

ముంచంగిపుట్టు: మండలంలో మధ్యాహ్నం వడగళ్ల వాన పడింది. ముంచంగిపుట్టు నుంచి పెదబయలు ప్రధాన మార్గంలో కిలగాడ, గుమ్మాఘాట్ మార్గం వడగళ్లతో నిండిపోయింది. మండలవాసులు ప్రత్యేక అనుభూతిని పొందారు.

పెదబయలు: మండలంలోని గురువారం మధ్యాహ్నం ఉరుములతో వర్షం కురిసింది.ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి, మధ్యాహ్నం వర్షం కురిసింది.

కొయ్యూరు: ఈదురు గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బూదరాళ్ల,చౌడుపల్లి ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

మిర్చి రైతుల్లో గుబులు



రేఖపల్లిలో కల్లంలోని ఎండుమిర్చిపై టార్పాలిన్ కప్పుతున్న రైతులు



కల్లాల్లో మిర్చి పంటపై కప్పిన టార్పాలిన్లు

వీఆర్‌పురం: అకాల వర్షాలు మండలంలోని మిర్చి, లంక పొగాకు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.గత రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృతం కావడం, ఈదురు గాలు వేయడంతో రైతులు కల్లాల్లోని మిర్చి,పాకలపై ఉన్న పొగాకు పంటలను సంరక్షించుకునే చర్యల్లో నిమగ్నమయ్యారు. చేతికందివచ్చిన పంట ఎక్కడ తడిచిపోతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు.

ఎటపాక: ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షానికి తడిచిపోయింది. గురువారం మధ్యాహ్నం నుంచి ఉరుములు,మెరుపులతో వర్షం కురవడంతో రైతులు అప్రమత్తమయ్యారు. కల్లాల్లో ఆరబోసిన మిరప కాయలపై టార్పాలిన్లు కప్పారు. మురుమూరు, తోటపల్లి, నెల్లిపాక తదితర ప్రాంతాల్లో తడిచిపోయినట్టు రైతులు తెలిపారు.

డిప్లొమాతో ఉద్యోగావకాశాలు

- ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే



మాట్లాడుతున్న పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే

చింతూరు: విద్యార్థులు పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యనభ్యసించడం ద్వారా ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గురువారం చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక, మారేడుమిల్లి, రంపచోడవరం మండలాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల భవిష్యతుకు బాటలు వేయడమే లక్ష్యంగా ఐటీడీఏ కృషి చేస్తోందన్నారు. పదో తరగతి అనంతరం విద్యార్థులంతా పాలిటెక్నిక్ చదివేలా అవగాహన కల్పించాలని, ప్రధానోపాధ్యాయులు దీనిని బాధ్యతగా తీసుకుని భవిష్యత్తు అవకాశాల గురించి విద్యార్థులకు వివరించాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆయన సూచించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఎటపాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పదో తరగతి వుత్తీర్ణులైన విద్యార్థులు చేరేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని పీవో ఆదేశించారు. ఏపీవో సుజాత, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు నర్సింహారావు, ప్రసాద్, కాట్లయ్య పాల్గొన్నారు.

దొంగనోట్ల ముఠా గుట్టురట్టు

- ఆదిలోనే పట్టుకున్న చింతూరు సబ్‌డివిజన్ పోలీసులు
- ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు
- ప్రధాన నిందితుల కోసం గాలింపు ముమ్మరం



అరెస్టు చేసిన దొంగనోట్ల ముఠాను చూపిస్తున్న పోలీసులు

చింతూరు: దొంగనోట్ల చలామణికి స్థానిక సబ్ డివిజన్ పోలీసులు ఆదిలోనే అడ్డుకట్ట వేశారు. గిరిజన ప్రాంతాల్లో చలామణికి టార్గెట్ చేసుకొని తెలంగాణ రాష్ట్రం పాల్వంచ కేంద్రంగా దొంగనోట్ల ముద్రణకు ముఠా తెరలేపింది. పాల్వంచ, ఉప్పల్, అశ్వారావుపేట, సత్తుపల్లి, పల్నాడు జిల్లా దుర్గికి చెందిన పాదిల మురళి, జంగం శ్రీనివాస్, కిరణ్‌కుమార్, పుల్లారావు, చిట్టిబాబు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఉమేష్‌చంద్రతో పాటు సామ్రాజ్యం అనే మహిళ ముఠాగా మూడు నెలల క్రితం ఏర్పడ్డారు. వీరు ముద్రించిన దొంగనోట్లను తెలంగాణలోని పాల్వంచ, భద్రాచలం, అల్లూరి జిల్లాలోని చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, ఛత్తీస్‌గఢ్‌లోని కుంటలో చలామణి చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు రూ.2.50 లక్షల మేర దొంగనోట్లను మార్పిడి చేశారు.

పథకం ప్రకారం బురిడీ..

రద్దీ ప్రదేశాలైన వారాంతపు సంతలు, పెట్రోల్ బంకులు, కిరాణాషాపులు, హోటళ్లలో రాత్రివేళల్లో మార్పిడి చేస్తున్నారు. రూ.లక్ష దొంగనోట్లకు రూ.10 వేలు అసలు నగదు చెల్లించేలా ఏజెంట్లతో బేరం కుదుర్చుకుంటున్నారు. దొంగనోట్ల కోసం వచ్చే ఏజెంట్లను ముఠా సభ్యులు పథకం ప్రకారం బురిడీ కొట్టిస్తున్నారు. నోట్ల తయారీకి సంబంధించి డ్రాయింగ్ బ్లాక్ కలర్ చార్ట్ పేపరును ఉపయోగిస్తున్నారు. దీనిని రూ.500 నోట్ సైజ్‌లో కట్ చేసి వీటిని బండిల్‌గా సిద్ధం చేస్తున్నారు. దొంగనోట్ల కోసం వచ్చే ఏజెంట్లకు అసలు రూ.500 నోటుపై అయోడిన్ పూత పూయడంతో నలుపు రంగులో మారిన నోటుని బండిల్స్‌పై పెట్టి హైపో లిక్విడ్ ద్రావణంతో కడుగుతున్నారు. వీటన్నింటిని ఆరబెడితే ఒరిజనల్ నోట్లు మాదిరిగా కనిపిస్తాయని వారిని నమ్మిస్తున్నారు.

కదిలిన డొంక..

వీఆర్‌పురం మండలంలో లభించిన క్లూ ఆధారంగా తీగలాగిన పోలీసులకు దొంగనోట్ల ముఠా చిక్కింది. వీఆర్‌పురంలోని ఓ దుకాణానికి ఆటోలో వచ్చిన భార్యాభర్తలు రూ.500 నకిలీ నోటు మార్చేందుకు ప్రయత్నించారు. అనుమానం వచ్చిన షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సోదా చేశారు. వారి నుంచి రూ.50 వేల విలువైన 500 రూపాయల దొంగనోట్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక బృందంగా ఏర్పడి..

దొంగనోట్ల చెలామణి వెనుక పెద్ద ముఠా ఉందని గ్రహించిన ఎటపాక సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, వెంకటేష్, పార్థసారథి ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. సిబ్బందితో కలసి తెలంగాణలోని పాల్వంచ, భద్రాచలంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ 44.50 లక్షల విలువైన నకిలీ రూ 500 నోట్లు, దొంగనోట్ల తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందుతులు ఇద్దరికోసం వారు గాలిస్తున్నారు.

ప్రకృతి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



శిక్షణ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్, బీట్ అధికారులు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ

చింతపల్లిరూరల్: ప్రకృతిని కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చింతపల్లి డివిజనల్ ఫారెస్టు అధికారి సూర్యనారాయణ తెలిపారు. రాజమండ్రి ఏపీ ఫారెస్ట్ అకాడమీ శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన ఫారెస్టు సెక్షన్, బీట్ అధికారులు 70 మంది గురువారం చింతపల్లి డివిజన్‌ను సందర్శించారు. సీలెరు, జీకే వీధి, చింతపల్లి డివిజన్‌లోని అడవులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సూర్యనారాయణ మాట్లాడుతూ అడవుల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. డివిజన్ పరిధిలో 1,90,000 హెక్టార్‌లో అటవీ సంపద ఉందని మారుజాతి, టేకు, వృక్షాలు కాపాడుకునేందుకు ప్రత్యేక సిబ్బందితో పర్యవేక్షణ నిర్వహిస్తున్నమన్నారు. నర్సీపట్నం నుంచి సీలేరు వరకు అడవులను కాపాడుకోడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నందన్నారు. ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరులో అటవీశాఖ అధ్యయన యాత్ర

సీలేరు: అటవీశాఖ అధ్యయన యాత్రలో భాగంగా గురువారం సీలేరు రేంజ్ పరిధిలో ఆరో బ్యాచ్‌కు చెందిన ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, 9వ బ్యాచ్ బీట్ అధికారులు సీలేరులో పర్యటించారు. చింతపల్లి సబ్ డీఎఫ్ ఎస్.ఎస్.బి.రాజ్ సిబ్బందికి అటవీ సంపదపై అవగాహన కలిగించారు. 1974, 1969 సంవత్సరాల్లో టేకు ప్లాంటేషన్, మారుజాతి ప్లాంటేషన్, నర్సరీలు, టేకు తిర్నింగ్ వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కలిగించారు. సీలేరు శ్రీనివాసరావు, డీఆర్‌వో సింహాచలం పడాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ భాషల్లో బోధన

- డీఈవో సలీమ్ బాషా

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాలలో ఉపాధ్యాయులంతా ఆదివాసీ భాషల్లో విద్యాబోధనకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సలీమ్‌బాషా కోరారు. ఇక్కడ ఎస్‌ఈజీ-ఫైర్ సంస్థ నిర్వహిస్తున్న హుకుంపేట మండలానికి చెందిన 196 పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో కువి, కొండదొర వంటి ఆదివాసీ సంస్కృతి భాషల్లో విద్యాబోధనతో ఆయా వర్గాల చిన్నారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మాతృభాష, ఆధారిత బహుభాషా విద్యాబోధన శిక్షణ కార్యక్రమాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హుకుంపేట ఇన్‌చార్జి ఎంఈవో చిట్టపులి బాబూరావు, సంస్థ ప్రతినిధులు ఎం.మణికుమార్‌బాబు, కె.రమేష్ పాల్గొన్నారు.

టెండరు ప్రకటన

A.P.S.R.T.C., పాడేరు డిపో గ్యారేజ్ నందు గల పెద్ద చెట్లు 24 కలవు. వాటిని కొట్టి తీసుకొని పోవుటకు టెండర్ పిలవడం జరుగుతున్నది. మీ యొక్క టెండర్ దరఖాస్తు తేది 20.03.2023 లోగా పాడేరు టెండర్ బాక్స్‌లో 14.00 గంటలలోపు వేయవలెను. పూర్తి వివరాలకు డిపో కార్యాలయమునకు సంప్రదించవలెను.

డిపో మేనేజర్, పాడేరు

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మారేడుమిల్లి : ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్థానిక ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జీ కిషోర్ బాబు తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో వై.రామవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, రంపచోడవరం, అడ్డతీగల, చింతూరులోని ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతిలోకి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. అడ్డతీగల, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరంలో పాఠశాలలో ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ఖాళీలను రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేవారు 13 సంవత్సరాలు, ఏడో తరగతికి 14, ఎనిమిదో తరగతికి 15 , తొమ్మిదో తరగతికి 16 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. ఆరో తరగతిలో ప్రవేశానికి 100 మార్కులు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు 200 మార్కులకు రాత పరీక్ష ఆంగ్లం, తెలుగులో ఉంటుందన్నారు. దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 15 చివరి తేదీ అన్నారు. రాజవొమ్మంగి, రంపచోడవరం, చింతూరులో ఈనెల 30న రాత పరీక్ష నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న యువతి

మారేడుమిల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువతి గురువారం ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. స్థానిక సంత మార్కెట్ వీధికి చెందిన సీరం లీస క్లారా అనే యువతి ఇంట్లో తరచూ కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై అధిక మోతాదులో పారాసెట్ మాల్ మాత్రలను మింగడంతో అపస్మారక స్థితిలో చేరిన ఆమెను బంధువులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం స్థానిక వైద్యుల సిఫార్సు మేరకు మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

21 నుంచి గ్రామ సభలు

చింతూరు: లిడార్ సర్వే ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో గుర్తించిన 17 గ్రామాల్లో ఈ నెల 21 నుంచి పోలవరం ముంపు గ్రామ సభలు నిర్వహించాలని పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ ఆదిత్య గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ గ్రామసభల్లో ముంపు ప్రభావిత కుటుంబాల జాబితా, భూసేకరణ చట్టం-2013 ప్రకారం ప్రభావిత కుటుంబాలకు అందించాల్సిన ఆర్‌అండ్‌ఆర్ పరిహారం, గృహ నిర్మాణాలు తదితర అర్హతలను గుర్తిస్తారు. పునరావాస కాలనీలు ఏర్పాటు చేయనున్న ప్రదేశాలు, ముంపునకు గురవుతున్న భూముల సేకరణ వివరాలు గ్రామసభల్లో సేకరించనున్నారు. వీఆర్ పురం మండలంలో రామవరప్పాడు, పత్తిపాక, గుండుగూడెం, ధర్మతాళ్లగూడెం, రాజుపేట కాలనీ, అడవి వెంకన్నగూడెం, చింతరేగుపల్లి, వడ్డిగూడెం, వీఆర్ పురం గ్రామాలున్నాయి. కూనవరం మండలంలో పంద్రాజుపల్లి, కొండ్రాజుపేట, టేకుబాక, శబరి కొత్తగూడెం, పెదార్కూరు, టేకులబోరు, కూనవరం గ్రామాలుండగా చింతూరు మండలంలో చింతూరులో గ్రామసభలు నిర్వహించనున్నారు.

పోరాటయోధుడు అమరజీవి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: తెలుగు రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన పోరాట యోధుడిగా అమరజీవి పొట్టి శ్రీరాములు చరిత్రలో నిలిచారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేశారన్నారు. ఐటీడీఏలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పీవో గోపాలకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమాల్లో ఏవో చిన్నికృష్ణ, ఐటీడీఏ ఏపీవో వీఎస్ ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఈఈ డీవీఆర్‌ఎం రాజు, పీఆర్(ప్రాజెక్టు) ఈఈ లావణ్యకుమార్, ఐటీడీఏ ఏవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి ఛత్తీస్‌గఢ్ ఉపాధ్యాయుడి మృతి



మృతి చెందిన జగన్‌మోహనరావు

చింతూరు: వర్షానికి గోడ కూలిన ఘటనలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంటకు చెందిన ఇమ్మనేని జగన్‌మోహనరావు (46) అనే ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ సంఘటన చింతూరు మండలం సుద్దగూడెంలో గురువారం చోటు చేసుకుంది. అతడు సుద్దగూడెంలో ఇటుక బట్టీ నిర్వహిస్తున్నాడు. అక్కడకు వెళ్లిన సమయంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో తాత్కాలికంగా నిర్మించిన ఇంట్లోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఇంటి గోడ కూలగా, సిమెంటు గుమ్మం జగన్ తలపై పడింది. దీంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం



నాగేశ్వరరావు (ఫైల్)

హుకుంపేట: రెణ్నెల్ల క్రితం అదృశ్యమైన యువకుడు పెదనందిపుట్టు కొండపై విగతజీవిగా కనిపించాడు. ఈ సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలో చీకుమద్దుల పంచాయతీ పెదనందిపుట్టు గ్రామానికి చెందిన వంతాల నాగేశ్వరరావు(26) రెణ్నెల్ల నుంచి కనిపించకుండా పోవటంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్లా గాలించారు. ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పెదనందిపుట్టు గ్రామానికి చెందిన కొంతమంది ఇక్కడ కొండపై ఏజెన్సీ రొయ్యలు, బొడ్డెంగులు తవ్వడానికి వెళ్లగా మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం బాగా పాడైపోయింది. సాయంత్రం వర్షం అధికంగా కురవడంతోపాటు చీకటి కావడంతో కొండపై నుంచి మృతదేహం తరలించేందుకు వీలు కాలేదు. ఈ ఘటనతో గ్రామం మొత్తం ఉలిక్కిపడింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అతడికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పది ఎకరాల జీడితోట దగ్ధం



దగ్ధమవుతున్న తోటలు

కొయ్యూరు: మూలపేట పంచాయతీ జాజులబంధ గ్రామంలో పది ఎకరాల జీడితోట గురువారం అగ్నికి ఆహుతి అయింది. రోలుగుంట మండలం అర్ల గ్రామానికి ఆనుకుని జాజులబంధ గ్రామస్తులు మర్రి జగ్గారావు, కామేశ్వరరావు, స్వప్న, సుబ్బారావుకు చెందిన తోటలు కాలిపోయాయి. తోటలకు భారీగా పెట్టుబడులు పెట్టామని, అగ్నికి దగ్ధమవడంతో సుమారు రూ.2.50లక్షలకు పైగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం అందేలా చూడాలని వారు కోరుతున్నారు. జీడీ తోటల్లో మంటలు వ్యాపించకుండా ప్రతిగెడ్డ గ్రామ గిరిజనులు అదుపుచేశారు.

నీట్ పీజీలో 1300 ర్యాంక్



అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన నీట్ పీజీ పరీక్షలో అఖిల భారత ర్యాంక్ 1300 వచ్చింది. కొయిలాడ రమణబాబు కుమార్తె అయిన హర్షప్రియకు ఈ ర్యాంక్ రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

హుకుంపేట: గ్రామ సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావాలని డీపీవో కొండలరావు సూచించారు. మండలంలోని తీగలవలస సచివాలయ కేంద్రంలో గురువారం సందర్శించారు. ఈ నేపథ్యంలో రికార్డులను పరిశీలించారు. పంచాయతీలో పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని, లేని పక్షంలో వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామ స్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపై దృష్టి పెట్టాలన్నారు. ఈవోపీఆర్డీ వంతాల పరశురామ్, పంచాయతీ కార్యదర్శి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పెదబయలు: గిరిజన ఉప ప్రణాళిక ద్వారా గిరిజన రైతులకు మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, జీవన ఎరువుల వినియోగం ఎంతో అవసరమని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్, ఉద్యానవన, వ్యవసాయ శాస్త్రవేత్తలు సత్తిబాబు, పి.బాబు అన్నారు. మండలంలోని గలగండ పంచాయతీ సిరసపల్లి గ్రామంలో మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతుల సాగుపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన పంటలో ఉపయోగించే పనిముట్లు, జీవన ఎరువుల వినియోగాన్ని వివరించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్, ఉద్యానవన, వ్యవసాయ శాస్త్రవేత్తలు సత్తిబాబు, పి.బాబు మాట్లాడుతూ భూసారానికి అనుకూలమైన పంటలు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పంటల మార్పిడి అవసరమన్నారు. ఏజెన్సీ వాతావరణం అనుకూలించడంతో రైతులు ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలన్నారు. జీవన ఎరువుల తయారి, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. జీవన ఎరువులు, మామిడి కవర్లు, ఉద్యాన పనిముట్లను రైతులకు పంపిణీ చేశారు. 60 మంది రైతులు పాల్గొన్నారు.

అడ్డతీగల: అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని ప్రకృతి సేద్యం చేయడంపై గిరిజనుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్టు రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం రంపచోడవరం డివిజన్ ఇన్‌చార్జ్ లక్ష్మణరావు చెప్పారు. దుశ్చర్తి రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు ప్రకృతి సేద్యంలో పాటించే నియమాలు, వాటి ప్రయోజనాలను వివరించారు.ముఖ్యంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని లక్ష్మణరావు రైతులకు సూచించారు. సీడ్ బాలింగ్ పద్ధతి ఉపయోగాలను తెలిపారు. సంప్రదాయ పంటలైన జొన్న, రాగులు, కొర్రలు, గంట్లు వంటి వాటిని సీడ్ బాలింగ్ విధానంలో వెదజల్లుకోవచ్చన్నారు. ఆయా పంటల ఆహారం తీసుకోవడం వల్ల బలవర్ధకమైన ఆహారం అందడంతో పాటు నిత్య ఆరోగ్యం సంక్రమిస్తుందన్నారు.

ప్రకృతి వనరులు ఉపయోగించుకుని ఎరువులు, పురుగు మందులు వాడకం లేకుండా పంటలు పెంచుకోవచ్చని చెప్పారు. సర్పంచ్ పల్లాల నూకరత్నం, పలువురు రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగ రిసోర్స్ పర్సన్ రాజ్యలక్ష్మి, ఉద్యాన సహాయకుడు దినేష్, రైతులు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: గుంతకల్ డివిజన్ పరిధిలో బేతంచర్ల-రంగాపురం-మల్కాపురం స్టేషన్ల పరిధిలో రెండవ లైన్ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు నిర్దేశించిన తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- భువనేశ్వర్-బెంగళూరు(18463)ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు, బెంగళూరు-భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు డోన్, గుంతకల్, గుత్తి మీదుగా కాకుండా వయా ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మార్గంలో ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి ఫోర్ట్ స్టేషన్లలో తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు.

కొన్ని రైళ్లు రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లోని మల్లిగుడ-ఛత్రిపుట్ మధ్య జరుగుతున్న పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డిసిఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు

- విశాఖపట్నం-కోరాపుట్(18512) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 20 తేదీల్లో రద్దు
- కోరాపుట్ -విశాఖపట్నం(18511) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18, 21 తేదీల్లో రద్దు
- కోరాపుట్-విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్ ఈనెల 23న రద్దు
- కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 23న రద్దు
- విశాఖపట్నం- కాకినాడ (17267/17268) మెము ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 18 తేదీల్లో రద్దు
- విశాఖపట్నం-రాజమండ్రి (07466/ 07467) మెము ఈ నెల 17,18 తేదీల్లో రద్దు

గమ్యం కుదించిన రైళ్లు

- కిరండూల్-విశాఖపట్నం(08552) 17న కోరాపుట్ వరకే నడుస్తుంది. అక్కడ నుంచి తిరిగి కిరండూల్ చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కోరాపుట్(08546) పాసింజర్ స్పెషల్ ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు రాయగడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కోరాపుట్-విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్ ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు రాయగడ నుంచే బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కిరండూల్(08551) స్పెషల్ ఈ నెల 17 నుంచి 22 వరకు అరకు వరకు మాత్రమే నడుస్తుంది. ఈ తేదీల్లో అరకు-కిరండూల్ మధ్య ఈ రైలు రాకపోకలు సాగించదు.

ఆపదలో అండగా..

- తీవ్ర అనారోగ్యంతో గర్భిణి
- కేజీహెచ్‌కు తరలించేందుకు అంబులెన్సు సమకూర్చిన చెట్టి వినయ్



గర్భిణి అప్పలమ్మను పరామర్శిస్తున్న చెట్టి వినయ్, వైఎస్సార్‌సీపీ నేతలు

హుకుంపేట: తీవ్ర అనారోగ్యానికి గురైన గర్భిణీని కేజీహెచ్‌కు తరలించేందుకు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తనయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ అంబులెన్సు ఏర్పాటుచేశారు. మండలంలోని మెరకచింతకు చెందిన గ్రామ వలంటీర్ గెమ్మెలి బుల్లిబాబు భార్య అప్పలమ్మ ఏడు నెలల గర్భిణి. బిడ్డ ఎదుగుదల సరిగ్గా లేకపోవడంతో పాడేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితి బాగులేనందున మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారు. విశాఖ తీసుకువెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో తన సమస్యను బుల్లిబాబు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశాడు. ఈవిషయం తెలుసుకున్న చెట్టి వినయ్ గురువారం ఉదయం పాడేరు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అంబులెన్సు ఏర్పాటుచేసి ఖర్చులకు కొంత నగదు ఇచ్చి కేజీహెచ్‌కు పంపించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్ అధికారులను ఫోన్లో కోరారు. పార్టీ మండల కోకన్వీనర్ కె.కోటిబాబు, జిల్లా వలంటీర్ల సంఘ ప్రధాన కార్యదర్శి బర్ల కొండబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రెస్ అకాడమీ కార్యదర్శి పర్యటన

సాక్షి,పాడేరు: ఏపీ ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్‌తిలక్ శుక్రవారం నుంచి జిల్లాలోని పాడేరు,అరకులోయ పర్యటిస్తారు. శుక్రవారం రాత్రి పాడేరుకు చేరుకోనున్న ఆయన స్థానిక కాఫీ అతిథి గృహంలో బస చేస్తారు. శనివారం ఉదయం పాడేరు మోదకొండమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు జరుపుతారు.అక్కడ నుంచి ఐటీడీఏ సమావేశమందిరానికి చేరుకుంటారు. అల్పాహారం అనంతరం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో మాట్లాడతారు. మధ్యాహ్నం అటవీశాఖ అతిథి గృహంలో భోజనం అనంతరం హుకుంపేట మండలంలోని మత్స్యగుండాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 4గంటలకు అరకులోయ చేరుకుని టూరిజం అతిథి గృహంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులతో సమావేశమవుతారు. రాత్రికి విశాఖపట్నం చేరుకుని సర్క్యూట్ హౌస్‌లో బస చేస్తారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రంలో నారాయణ నవగ్రహ హోమాన్ని గురువారం నిర్వహించారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూ హోమం చేపట్టామని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. అంతకుముందు శ్రీ మానసాదేవి అమ్మవారికి శ్రీ సూక్తం పరంగా కుంకుమ పూజ, హోమం చేపట్టారు. వై.రామవరం మండలం దాలిపాడు, రాజవొమ్మంగి మండలం వాతంగి, అడ్డతీగల ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిపారు.

137 పశువులకు టీకాలు



పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ జీలుగులపాడు, వంతెనవానిపాలెం గ్రామాల్లో కాశీపట్నం పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో వెటర్నరీ అసిస్టెంట్ అనిల్‌బాబు 137 పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలోని పాల్గొన్న సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ మితుల మాట్లాడుతూ పశువులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామన్నారు. దీంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. పశు వైద్య సిబ్బంది తీరును ప్రశంసించారు. వీఆర్వో శంకరరావు, గ్రామ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు పనులు ప్రారంభం



పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొములునాయుడు

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ జాముగుడ గ్రామంలో వాసన్ స్వచ్ఛంద సంస్థ నిధులతో కొర్రాయి, సొవ్వ, కోల్లాపుటు పంచాయతీల్లో చెరువు తవ్వకాల పనులకు గురువారం బొందుగుడ గ్రామంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బురిడి కొములునాయుడు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ చెరువుల ఏర్పాటుతో రైతులకు సాగునీరు అందుతోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వాసన్ సంస్థ సేవలను కొనియాడారు. సంస్థ ప్రతినిధులు జయరాం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


డీవార్మింగ్ మాత్రల పంపిణీ



డిగ్రీ విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా వలంటీర్లు, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్, డాక్టర్ రామకృష్ణ తదితరులు విద్యార్థులకు అందజేసి, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, ఐఅండ్ఏసీ సమన్వయకర్త కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు అందజేత



పెన్నులు అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చింతపల్లిరూరల్: ఇంటర్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా మండల కేంద్రంలో గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సిరులు

- పెరిగిన దంపుడు బియ్యం వినియోగం
- వారపు సంతల్లో జోరుగా వ్యాపారం
- ఆనందంలో గిరిజన రైతులు



దంపుడు బియ్యం



వారపు సంతలో చిరుధాన్యాలు

జి.మాడుగుల: ఆరోగ్య సిరులుగా చిరుధాన్యాలు పేరొందాయి. చిరుధాన్యాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది.. పోషక విలువలున్న చిరుధాన్యాల మార్కెట్ గణనీయమంగా పెరిగింది. మైదాన ప్రాంతాలతో పాటు ఏజెన్సీ వ్యాప్తంగా విక్రయాలు జోరందుకున్నాయి. దంపుడు బియ్యం, చిరుధాన్యాలు వినియోగం పెరగడంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని వారపుసంతల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అల్లూరి జిల్లా ఏజెన్సీలోని ఆదివాసీ ప్రజానీకంలో అనేకమంది దంపుడు బియ్యం, రాగులు, జొన్నలు, సామలు చిరుకందులు, రాజ్‌మా కందులు చిరుధాన్యాలు విస్తారంగా వినియోగిస్తున్నారు. గిరిజనుల రోజూ వారి ఆహార విధానంలో అంబలి తప్పనిసరిగా ఉంటుంది.

గిరిజన ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయం ఎక్కువగా చేస్తారు. ఏజెన్సీలో రసాయన ఎరువుల రహిత పంటలు వరితో పాటు, చిరుధాన్యాలు, పసుపు, అల్లం, పిప్పలి వంటి వాణిజ్యపంటలు కూడా పండిస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో పండించే పంటలకు మైదాన ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువ. ఈ నేపథ్యంలో ఏజెన్సీలో పండించే సామలు, కొర్రలు, రాగులు తదితర చిరుధాన్యాలకు గిరాకీ ఎక్కువగా ఉంది. గ్రామాల్లో విరివిగా లభిస్తున్న పోషక విలువలు గల అహారం పట్ల దృష్టి సారిస్తున్నారు. దంపుడు బియ్యం, సామ బియ్యం, రాగులు, కందులు చిరుధాన్యాలు వినియోగం పెరగడంతో వీటి వ్యాపారం జోరుగా సాగుతుంది. ఏజెన్సీలో మండల కేంద్రాలు, వారపు సంతల్లో దంపుడు బియ్యం, సామ బియ్యం, కందులు, చిరుధాన్యాల దుకాణాలు ఏర్పాటు చేసి సరసమైన ధరలకు విక్రయిస్తున్నారు. వ్యాపారం బాగుండడంతో గిరిజన రైతులు ఎక్కువ విస్తీర్ణంలో చిరుధాన్యాల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిరుధాన్యాల ధరలు

దంపుడు బియ్యం కిలో రూ.30, సామ బియ్యం కిలో రూ.30, కొర్రలు కిలో రూ.25, రాగులు కిలో రూ.25, రాజ్‌మా చిక్కుళ్లు (తెలుపు)కిలో రూ.90, రాజ్‌మా (ఎరుపు) కిలో రూ.75చొప్పున విక్రయిస్తున్నారు.

ఆశాజనకంగా ధరలు

వరితో పాటు, రాగులు, సామలు, కొర్రలు వంటి చిరుధాన్యాల పంటలు పండిస్తున్నాం. పంటలో కొంత భాగం అవసరాలకు ఉంచుకొని మిగిలిన పంటను వారపు సంతలకు తరలించి విక్రయిస్తున్నాం. వారపు సంతల్లో వీటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

–సుబ్బారావు,రైతు, ఎస్.పెదబయలు, జి.మాడుగుల మండలం

స్టడీ టూర్లతో విజ్ఞాన వికాసం



పార్లమెంట్ భవనం ఎదుట గిరిజన విద్యార్థులతో అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు: స్టడీ టూర్లతో విద్యార్థులు వికాసం పొందవచ్చని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి గురువారం గిరిజన విద్యార్థులకు సూచించారు. అల్లూరి జిల్లాకు చెందిన పలువురు గిరిజన విద్యార్థులు, ఉపాధ్యాయులు యూనియన్ బ్యాంకు ఆర్థిక సాయంతో నిర్వహించిన పార్లమెంట్ స్టడీ టూర్‌కు ఢిల్లీ విచ్చేశారు. ఇందులో భాగంగా పార్లమెంట్ భవనంలో వారు అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరుగా ప్రజల ద్వారా ఎన్నుకోబడిన వారు పార్లమెంట్‌లో స్థానిక ప్రాంత సమస్యల పరిష్కారానికి అనేక అంశాలను ప్రస్తావిస్తారని చెప్పారు. పార్లమెంట్ గొప్పతనాన్ని వివరించారు. దేశంలో అనేక ప్రాంతాల నుంచి ఎన్నుకోబడిన ప్రతినిధులు పార్లమెంట్‌లో వారి ప్రాంత సమస్యలపై చర్చిస్తారన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యక్రమంలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం నిర్వహించారు. కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్‌కు రిటైర్డ్ టీచర్ మోపిదేవి వెంకట రామమ్మ అందజేసిన రూ.25 వేలతో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ప్రారంభించారు. అలాగే విద్యార్థులు శ్రమదానంతో ఏర్పాటు చేసిన పార్కింగ్ షెడ్‌ను సబ్ కలెక్టర్ ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా వీరభద్రరావు, ఉపాధ్యక్షుడుగా కిరణ్, కార్యదర్శిగా అపర్ణ, జనరల్ సెక్రటరీ చక్రపాణి, ట్రెజరర్‌గా బ్రహ్మ, సంయుక్త కార్యదర్శిగా పల్లాల దుర్గాప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు,, వైస్ ప్రిన్సిపాల్ డి.రవికుమార్‌ల పర్యవేక్షణలో జేజేబాబు సహకారంతో నిర్వహించారు. అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

21 నుంచి మత్స్యదేవత జాతర మహోత్సవాలు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ ఎస్.కొత్తూరు గ్రామంలో మత్స్య దేవత జాతర మహోత్సవాలు ఈ నెల 21 నుంచి 23 వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 18 నుండి 21వ తేదీ వరకు మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.200 ఎంట్రీ ఫీజు చెల్లించి టీమ్ పేర్లు పేరు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలో విజేత టీమ్‌కు రూ.10,016, రెండవ బహుమతి రూ.5,016 షీల్డు అందజేస్తున్నట్టు టీమ్‌లో ఏడుగురు సభ్యులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8985912551, 8985286535, 7735355327 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



తాడపల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి పంచాయతీ తాడపల్లి గ్రామంలో కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రమేష్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 30 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు ఆయన చెప్పారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించారు. అనంతరం మలేరియా, టైఫాయిడ్, టీబీ, డయేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. పెదగూడ పంచాయతీ కేంద్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు ఆయన సూచించారు. కిలగాడ వైద్య సిబ్బంది బి.కృష్ణవేణి, కె.సుబ్రహ్మణ్యం, ముక్తమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణకు చర్యలు



సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: మండలంలో తరచు సంభవిస్తున్న శిశు మరణాలను అరికట్టేందుకు సిబ్బంది శక్తివంచన లేకుండా పని చేయాలని, ఈ మరణాల పట్ల పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలని ఎంపీడీఓ బాపన్నదొర కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏఎన్ఎం, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, మహిళ పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన గురువారం సమావేశమయ్యారు. చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. డీ వార్మింగ్ మాత్రల పంపిణీ లక్ష్యం పూర్తి చేయాలన్నారు. వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ, ఫీవర్ సర్వే, ఫ్రైడే డ్రైడే వంటి ప్రభుత్వ కార్యాక్రమాలను తప్పకుండా నిర్వహించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయమందిస్తున్న శివప్రసాద్ తదితరులు

కొయ్యూరు: అంతాడ పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నేను సైతం చారిటబుల్ ట్రస్టు ఆదుకుంది. ఈ నేపథ్యంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఆదేశాల మేరకు సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ గురువారం గ్రామాన్ని సందర్శించి, అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.15వేలు నగదును అందజేశారు. అగ్ని ప్రమాద బాధిత కుటుంబాల్లో ఎనిమిది నెలల గర్భిణి అయిన రాటా మంగకు భద్రాచలం ప్రాంతానికి చెందిన పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.5వేల నగదును అందజేసింది. కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్, నేనుసైతం చారిటబుల్ సంస్థ డైరెక్టర్ పంచాడ శ్రీరామ్మూర్తి, సర్పంచ్ చంద్రరావు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఎస్.కిరణ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రీముల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో గురువారం భారీ అన్న సమారాధన జరిగింది. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. హేమ, మణికంఠ దంపతులు అన్నదానానికి విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు చెప్పారు.

క్షయపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అడ్డతీగల: క్షయ వ్యాధి నిర్మూలన కోసం అందరూ భాగస్వాములు కావాలని ఎల్లవరం పిహెచ్‌సి వైద్యాధికారి కె.భాస్కర్ అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి సమయంలో జ్వరం, ఆయాసం, కఫం పడటం, మెడ దగ్గర కణితులు, బరువు తగ్గడం, కఫంలో రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించి, పరీక్షలు చేయించాలని సూచించారు. క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఇఓ శ్యామ్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలు



రికార్డులను పరిశీలిస్తున్న వెంకటరావు

కొయ్యూరు: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సీహెచ్.వెంకటరావు గురువారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు అందజేస్తామని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో 80 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 40 మంది ఉన్నారని తెలిపారు. గ్రంథాలయాలు లేని చోట్ల బుక్ డిపో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 63 గ్రంథాలయాలు ఉన్నట్టు పేర్కొన్నారు. వాటితో పాటు విశాఖలో జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉందన్నారు. గ్రంథాలయ సెస్ వసూలుకు ఆదేశాలిచ్చామన్నారు. ఎక్కువగా నిధులు జీవీఎంసీ నుంచి రావలసి ఉందన్నారు. దీని కోసం లేఖలు రాశామని తెలిపారు. జి.మాడుగుల, పెదబయలు, కొయ్యూరులో గ్రంథాలయ భవనాల నిర్మాణం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఆయన వెంట గ్రంథాలయ నిర్వాహకులు ఆర్.కన్నబాబు ఉన్నారు.

అమరజీవికి ఘన నివాళి



అరకులోయలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు



గంగవరంలోని పొట్టి శ్రీరాములు జయంతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు తదితరులు

అరకులోయ: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ భరత్‌కుమార్ నాయక్, డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం జీవితాన్నే త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. జూనియర్ అసిస్టెంటు కృపావరం, ఏవో ఉషారాణి, ఓఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అప్పారావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు.

రాజవొమ్మంగి: బోర్నగూడెం స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో హెచ్ఎం ఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ అమరజీవి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కృష్ణ, ధర్మరాజు, కోటేశ్వరరావు, గంగన్నదొర తదితరులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రి దృష్టికి సీఆర్టీల సమస్యలు



మంత్రి రాజన్నదొరకు సీఆర్‌టీల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

రంపచోడవరం: సీఆర్‌టీల సమస్యలు పరిష్కరించి, వారిని క్రమబద్ధీకరించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొరను వెలగపూడిలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) తదితరులు వినతిపత్రం అందజేశారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు 12 నెలలు జీతాలు చెల్లించాలని కోరారు. గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండేని కూడా కలిసి సీఆర్‌టీల సమస్యను వివరించారు.

సెల్ టవర్ పనులకు శంకుస్థాపన



సెల్‌టవర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సాయిత, నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ సాగేరివలస గ్రామంలో సెల్‌టవర్ నిర్మాణానికి సర్పంచ్ పాండొయి సాయిత గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్ టవర్ నిర్మాణం వేగవంతం చేసి వినియోగదారులకు ఉపయోగ పడేలా చూడలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు



జి.మాడుగులలో పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు

ముంచంగిపుట్టు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రాంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు. ముంచంగిపుట్టులో 170 మంది విద్యార్థులకు గాను 166 మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, అధికారి గణపతి తెలిపారు.

జి.మాడుగుల: మండలంలోని ఇంటర్ సెకండియర్ పరీక్షలో 343 మంది విద్యార్థులకు గాను 338 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు.

హుకుంపేట: మండల పరిధిలోని ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో 258 మందికి గాను 243 మంది హాజరైనట్టు స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సందర్శించారు. మాస్‌కాపింగ్ జరగకుండా చూడాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించినట్టు ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు చెప్పారు.

రాజవొమ్మంగి: మండలంలోని ఇంటర్ సెకండియర్ పరీక్షకు 9 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ విజయ మోహనరావు చెప్పారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ చినకోనెల, బూరుగు గ్రామాల్లో గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలోని తాగునీటి సదుపాయం లేకపోవడంతో కలుషితమైన నీటిని సేవించి, బూరుగు గ్రామానికి చెందిన ఎస్.సన్యాసి(60), ఎస్.వీరయ్య(65), జన్ని కొత్తమ్మ(5), బి. చిన్నజోగయ్య(60), బి.గంగమ్మ(50), బి.మాలమ్మ(7), బి.లచ్చమ్మ(8), బి.పెంటయ్య(9) అనే గిరిజనులు జ్వరాలతో మంచం పట్టారు. చినకోనేల గ్రామాల్లో గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామాల్లో తక్షణమే వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు సన్యాసిరావు, శంకరరావు కోరుతున్నారు.

తడకలో కొనసాగుతున్న వైద్య శిబిరం

అరకులోయ: గన్నెల పంచాయతీలోని తడక గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ గురువారం కూడా ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించింది. మృతి చెందిన మేకమాంసం తిని గ్రామంలో చిన్నారి మృతి చెందడంతో పాటు 11 మంది గిరిజనులకు అస్వస్థతతో అరకులోయ ఏరియా ఆస్పత్రిలో రెండు రోజుల నుంచి వైద్యసేవలు పొందుతున్నారు. తడక గ్రామంలో వైద్యశిబిరం రోజు నిర్వహించాలని కలెక్టర్, ఐటీడీఏ పీవోల ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. బుధవారంతో పాటు గురువారం ఉదయం నుంచి వైద్య బృందాలు గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు సీహెచ్.కమలకుమారి, కె.ఎ.సుసాన్‌ల పర్యవేక్షణలో వైద్య బృందం ఇంటింటా తిరిగారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. పశువైద్య సిబ్బంది కూడా గ్రామంలో సందర్శించారు. అరకులోయ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న బాధితుల నుంచి రక్త సమూనాలు సేకరించారు. వైద్య శిబిరంలో పిహెచ్ఎన్ ఎస్.కె.కన్నాభీ, హెచ్‌వీ.పెంటమ్మ, ఎఎన్ఎం సంతోషి, హెల్త్ అసిస్టెంట్ దొన్ను, ఆశ కార్యకర్త వరహాలమ్మ, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

హుకుంపేట: పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో కించుమండ నుంచి పైనంపాడు వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.